సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

క్లుప్తంగా

రోటరీ వైజాగ్ మెట్రో నూతన కార్యవర్గం



రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో నూతన కార్యవర్గంతో గవర్నర్ కల్యాణ్ చక్రవర్తి

సీతంపేట: రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం గురువారం సీతమ్మధారలోని కేఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. క్లబ్ అధ్యక్షుడిగా కూటికుప్పల రవికిరణ్ ప్రసాద్, కార్యదర్శిగా పీబీఎస్ఎన్ రెడ్డి, కోశాధికారిగా ప్రశాంతి, ఉపాధ్యక్షులుగా షీలా, క్లబ్ డైరెక్టర్లుగా వై.వి.వి.సత్యనారాయణ, మిరియాల వేణుగోపాల్, రామ్ పలిశెట్టి, శ్రీనివాస్ రెడ్డి, హరిత, షరిమల, నాగిరెడ్డి, కృష్ణయ్య తదితరులు రోటరీ జిల్లా గవర్నర్ డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి చేతుల మీదుగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో హనుమంతవాక జంక్షన్‌లో మెట్రో గ్రీన్ పేరిట పెంచుతున్న మొక్కలు, గోపాలపట్నంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ గవర్నర్ కె.సునీత లావణ్య, క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మొదిలి మహేష్ పాల్గొన్నారు.

శాకంబరిగా నీలమ్మ వేపచెట్టు అమ్మవారు



శాకంబరి అలంకరణలో అమ్మవారు

అల్లిపురం: ఆషాఢ శుద్ధ పౌర్ణమి సందర్భంగా అస్కాం గార్డెన్స్‌లో వెలసిన నీలమ్మ వేప చెట్టు అమ్మవారు గురువారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి తెల్లవారుజాము నుంచి ఆలయ అర్చకుడు జోగారావుశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహానికి విశేష అభిషేకాలు చేపట్టారు. అమ్మవారిని ఆకుకూరలు, కూరగాయలు, పనస పండ్లు, పైనాపిల్, మామిడి పండ్లతో విశేషంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరి పూజలు చేశారు. అమ్మవారి శాకాన్నం ప్రత్యేక ప్రసాదంగా భక్తులకు అందజేశారు.

మర్రిపాలెం రైతుబజార్‌లో తనిఖీలు



రైతులతో మాట్లాడుతున్న డీడీ శ్రీనివాస్

విశాఖ విద్య: మర్రిపాలెం రైతుబజార్‌లో గురువారం జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఉప సంచాలకుడు శ్రీనివాస్ కిరణ్ ఆకస్మిక తనిఖీలు చేశారు. పచ్చిమిర్చి, టమాట, ఉల్లిపాయల కౌంటర్లను, రైతు గుర్తింపు కార్డులను, వ్యాపార దుకాణాలను పరిశీలించారు. అన్ని రకాల కూరగాయలు రైతుబజార్లలో అందుబాటులో ఉండేటట్లు చూసుకోవాలని, లేనిపక్షంలో తమ దష్టికి తీసుకురావాలని సూచించారు. ఉల్లిపాయలు, బంగాళదుంపలు, టమాటాలు వంటివి నాణ్యమైన సరకులు మాత్రమే తెప్పించుకోవాలన్నారు. రైతుబజార్‌లో కొత్తగా జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. డీసీఎంఎస్ కౌంటర్ మేనేజర్‌తో వారు అద్దె బకాయిలు ఉండటం వల్ల త్వరగా చెల్లించాలని, లేకపోతే కౌంటర్‌ను రద్దు చేస్తామని ఫోన్‌లో మాట్లాడారు. వినియోగదారులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలపై రైతుబజారు ఈవో నాగేశ్వరరావును అడిగి తెలుసుకుని, సంతప్తి వ్యక్తం చేశారు. నాణ్యమైన తాజా కూరగాయలు, ఆకుకూరలు అందించేలా శ్రద్ధ తీసుకోవాలని డీడీ శ్రీనివాస్ సూచించారు.

సత్యకుమారికి ఉమెన్ అచీవర్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న సత్యకుమారి

దాబాగార్డెన్స్: సౌత్ ఇండియా ఉమెన్ అచీవర్స్ అవార్డ్–2025లో చేంజ్ మేకర్ విభాగంలో విశాఖకు చెందిన ఉన్నవ వెంకట సత్య కుమారి పురస్కారానికి ఎంపికయ్యారు. గురువారం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ అవార్డుల కార్యక్రమం చెన్నైలోని ఎంసీసీ స్కూల్ ఆడిటోరియంలో ఈనెల 9న జరిగిందన్నారు. సేవా, మహిళల సాధికారత రంగాల్లో విశేష కృషి చేసిన వారికి ఈ పురస్కారాలు అందిస్తారని వెంకట సత్యకుమారి తెలిపారు.

ఇరుకు గదుల్లో సర్కారు వైద్యం

- నందులో గెడ్డ, సులభ్ కాంప్లెక్స్ పక్కన అంబేడ్కర్ కాలనీ ఆరోగ్య కేంద్రం
- పట్టుమని పది మంది కూడా పట్టని వైనం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న గర్భిణులు
- వుడా కాలనీలో విశాలమైన ఆస్పత్రి నిర్మించాలని స్థానికుల విజ్ఞప్తి



అంబేడ్కర్ కాలనీలోని చిన్న సందులో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మర్రిపాలెం: ఇరుకిరుకు గదులు.. రోత పుట్టించే పరిసరాలు.. అందులోనూ చిన్న సందులో ప్రభుత్వ ఆస్పత్రి.. అక్కడ వైద్యం పొందాలంటే పరిస్థితి ఎలా ఉంటుందో స్థానికులకే తెలుస్తుంది. వర్షా కాలంలో విష జ్వరాలు, దోమల వ్యాప్తి అధికంగా ఉంటుంది. ఈ తరుణంలో గెడ్డ, సులభ్ కాంప్లెక్స్ పక్కన కనీసం నిల్చోడానికి కూడా చోటు లేని ఇరుకు ఆస్పత్రిని చూసి నివాసులు, రోగులు విసుగు చెందుతున్నారు. జీవీఎంసీ 51వ వార్డు ఆర్ అండ్ బీ జంక్షన్‌కు కూతవేటు దూరంలోని అంబేడ్కర్ కాలనీలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్) దుస్థితి ఇది. కూటమి ప్రభుత్వం కనీసం ప్రజల ఆరోగ్యంపై దృష్టి కూడా పెట్టడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట వేసి.. విశాలమైన ఆరోగ్య కేంద్రాలు నిర్మించినట్లు గుర్తు చేసుకున్నారు.

కూర్చోలేరు.. నిల్చోలేరు

అంబేడ్కర్ కాలనీలోని ఇరుకు సందులో ఉన్న ఈ ఆరోగ్య కేంద్రంలో వరుసగా మూడు గదులు పక్క పక్కనే ఉంటాయి. వాటిలో డాక్టర్ చాంబర్ ఒక మూల ఉంటే.. మిగితా గదుల్లో ల్యాబ్, మందులు ఇలా స్టాక్ పెట్టుకునే పరిస్థితి. ముఖ్యంగా ఈ



డాక్టర్ చాంబర్ పక్కనే గజిబిజిగా గదులు

ఆరోగ్య కేంద్రానికి వచ్చే గర్భిణులకు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలుగంటే నాలుగే కుర్చీలు, అందులో ఒకరు కూర్చుంటే.. మరొకరికి చోటు ఉండదు. నిల్చుందామన్నా ఒకరు నిల్చుంటే మరొకరు నిల్చోడానికి కూడా వీలు లేని పరిస్థితి. దీంతో ఇక్కడ వైద్య సేవలు పొందేందుకు రోగులు, గర్భిణులు ఇబ్బంది పడుతున్నారు.

కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్‌లకు వినతి

ఈ ఆరోగ్య కేంద్రం ఉన్న సందులోకి ఒక ద్విచక్ర వాహనం వెళ్తే.. మరొకటి వచ్చేందుకు చోటు ఉండదు. ఇటువంటి ఇరుకు ప్రదేశంలో ప్రభుత్వ ఆస్పత్రి నిర్వహిస్తే.. ప్రజలకు ఎలా తెలుస్తుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఆరోగ్య కేంద్రంలో వైద్య



ఆరోగ్య కేంద్రంలో చిన్న గదులు



ఆరోగ్య కేంద్రంలో ఉన్న నాలుగే కుర్చీలు

సిబ్బంది కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సదుపాయంతో కూడిన వైద్యం చేయలేకపోతున్నారని చెబుతున్నారు. ఈ విషయమై స్థానికులు వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ దృష్టికి తీసుకెళ్లగా. ఆయన జీవీఎంసీ కౌన్సిల్‌లో ఆరోగ్య కేంద్రం కోసం పలుమార్లు చర్చించారు. కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్‌లను కార్పొరేటర్ కలిసి వినతిపత్రాలు అందజేశారు. మాధవధార వుడా కాలనీలో 46 సెంట్ల ప్రభుత్వ స్థలం ఉందని, అక్కడ ఎనిమిది పడకల ఆస్పత్రి నిర్మిస్తే స్థానికులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన కోరారు. ఉన్నతాధికారులు స్పందించి తమ ప్రాంతంలోని వుడా కాలనీలో విశాలమైన ఎనిమిది పడకల ఆస్పత్రి(యూపీహెచ్‌సీ) నిర్మించాలని, తద్వారా వార్డు ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుతుందని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రోగాల భయం

ఈ ఆస్పత్రి ప్రధాన గెడ్డకు ఆనుకుని ఉంది. దాని పక్కనే సులభ్ కాంప్లెక్స్ ఉండటం వల్ల ఆ ప్రాంతమంతా దోమలతో నిండిపోయింది. నిత్యం ఈ ఆరోగ్య కేంద్రానికి వచ్చే వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోగాల బారిన పడుతున్నామని చుట్టుపక్కల నివాసులు వాపోతున్నారు. దీంతో వేల రూపాయలు ఖర్చు చేసి ప్రైవేట్ ఆస్పత్రికి తరలిపోతున్న పరిస్థితి ఏర్పడింది.



ఆస్పత్రి దారిలో ప్రధాన గెడ్డ

వైభవుడికి పంచామృతాభిషేకం



వైభవ వేంకటేశ్వర స్వామి

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆషాఢ పౌర్ణమి ఉత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో శ్రీవారికి పంచామృతాభిషేకం చేశారు. ఉదయం ఆర్జిత సేవలో భాగంగా భక్తులు, దాతలు మంగళ ధ్వని, వేదమంత్రోచ్ఛరణలతో అభిషేక ప్రదర్శన చేశారు. అనంతరం పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పంచదార, ఫలరసాలు, పసుపు, కుంకుమ, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకం జరిపారు. మురళీనగర్ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బి.ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఉన్నత లక్ష్యాలతో చదువుకోవాలి



కృష్ణా కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లతో ఎమ్మెల్సీ చిరంజీవిరావు తదితరులు

మద్దిలపాలెం: మద్దిలపాలెంలోని డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో విద్యలో రాణించాలన్నారు. ప్రైవేట్ కాలేజీ కంటే నిష్ణాతులైన అధ్యాపక బృందం ప్రభుత్వ కళాశాలలో ఉన్నారన్నారు. వారి బోధనలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఎన్‌సీసీ క్యాడెట్లకు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్జేడీ మజ్జి ఆదినారాయణ, ప్రిన్సిపాల్ బి.సుజాత, లయన్స్ క్లబ్ ట్రస్టీ దుర్గాప్రసాద్, అధ్యాపకులు వేదవ్యాస్, సన్యాసిరావు పాల్గొన్నారు.

మెగా సమస్యలతో.. ఆత్మీయ సమావేశం



శాంతినగర్ పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ సతీష్

కంచరపాలెం: పాఠశాలల్లో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ అంతా ఆర్భాటం కోసం ఏర్పాటు చేసినట్లు కనిపించింది. శాంతినగర్ ప్రాథమిక పాఠశాలలో మౌలిక సమస్యలు, రాంజీ ఎస్టేట్ ప్రాథమికోన్నత పాఠశాలలో సరిపడా ఉపాధ్యాయులు లేకుండానే నెల రోజులుగా తరగతులు నెట్టుకొస్తున్నారు. కప్పరాడ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, ధర్మానగర్, తిక్కవానిపాలెం పాఠశాలల్లో మొక్కుబడిగా పీటీఎంలు నిర్వహించినట్లు పలువురు పలువురు తల్లిదండ్రులు తెలిపారు. పాఠశాలల్లో నెలకొన్న మెగా సమస్యలతో మీటింగ్ నిర్వహించడం కూటమి ప్రభుత్వానికి హంగేనని పేర్కొన్నారు.

డిప్యూటీ మేయర్ దృష్టికి పాఠశాల సమస్యలు

జీవీఎంసీ 46వ వార్డు తాటిచెట్లపాలెం పరిధి శాంతినగర్ ప్రాథమిక పాఠశాలలో గురువారం మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ పాల్గొని ఆత్మీయ సమావేశాన్ని ప్రారంభించారు. మీటింగ్ అనంతరం తల్లిదండ్రులు పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని మౌలిక సదుపాయాలతో పాఠశాలలను అభివృద్ధి చేస్తే.. నేడు పాఠశాలలో బల్లలు లేక విద్యార్థులు నేల మీద కూర్చొనే దుస్థితి పట్టిందని, టాయిలెట్ల పరిస్థితి అలాగే ఉందని, మధ్యాహ్నం భోజనంలో మసాలాలు అధికంగా వాడటంతో తమ పిల్లలకు ఇంటి భోజనమే పెట్టే పరిస్థితికి చేరుకుందని పేరెంట్స్ అన్నారు. తాగునీటి వాటర్ ప్లాంట్‌లు మూలకు చేరడంతో బోరు నీరే వినియోగించాల్సి వస్తోందని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమస్యలపై డిప్యూటీ మేయర్ సతీష్‌కు వినతిపత్రాలు అందించారు. జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడి పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని లలిత, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గోవింద, పేరెంట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మార్కుల కంటే నైపుణ్యాలు మేలు

సీతంపేట: మార్కులు ప్రామాణికం కాకుండా నైపుణ్యాలపై విద్యార్థులు దృష్టి సారించాలని విశాఖ ఎంపీ భరత్ సూచించారు. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో గురువారం జరిగిన మెగా పీటీఎంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ముచ్చటించారు. పాఠశాలలో మూలన పడిన వాటర్ ప్లాంట్‌ను వినియోగంలోకి తేవడం, విద్యార్థులకు మంచి డైనింగ్ వసతి కల్పించేలా చూడాలన్నారు. వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి, ముక్కా కిశోర్, హెచ్‌ఎం జయంతి రాధాకుమారి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

- మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులకు మ్యూజికల్ చైర్, టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించారు. కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, హెచ్‌ఎంలు లక్ష్మీ నరస, జ్యోతి పాల్గొన్నారు.
- విద్యార్థుల భవిష్యత్ రూపకల్పనలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమన్వయం కీలకమని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు అన్నారు. సీతమ్మధార పీఅండ్‌టీ కాలనీలోని ఎస్‌ఎంసీ హైస్కూల్‌లో గురువారం జరిగిన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. విద్యార్థుల విద్యా ప్రగతి, స్కూల్ అభివృద్ధి, తల్లిదండ్రుల సహకారంపై చర్చ జరిగింది. పాఠశాలలో విద్యా నాణ్యత, మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడానికి తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, టీడీపీ నాయకులు నజీర్, బర్ల బాలకృష్ణ, ధర్మ, హరిత, హెచ్‌ఎం రాము, సునీత పాల్గొన్నారు.



ఎస్‌ఎంసీ హైస్కూల్ పీటీఎంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

మురళీనగర్: మాధవధార జీవీఎంసీ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, ఏఎస్సార్ నగర్‌లోని కె.కాలనీ హైస్కూల్, బర్మా క్యాంప్ ప్రాథమిక పాఠశాలల్లో హెచ్‌ఎంలు బి.హేమలత, కె.వసంతకుమారి తదితరుల అధ్యక్షతన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌లు నిర్వహించారు. మాధవధార హైస్కూల్‌లో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సహకారం అందిస్తానన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతోపాటు ఎన్‌ఎంఎం ఉపకార వేతనానికి ఎంపికైన ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున నగదు ప్రోత్సాహం, జ్ఞాపికలు, హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను ఎమ్మెల్యే అందించారు. టీడీపీ 50వ వార్డు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, పాఠశాల కమిటీ సభ్యులు, బీజేపీ నాయకుడు నజీర్ పాల్గొన్నారు.

జై జై సద్గురు సాయి

- భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు
- బాబా సేవలో తరించిన భక్తులు


సీతంపేట: గురుపౌర్ణమి పర్వదినం సందర్భంగా గురువారం నియోజకవర్గంలోని షిర్డీసాయి మందిరాలు భక్తులతో పోటెత్తాయి. వేకువజాము నుంచే పంచామృతాభిషేకం, కాగడ హారతి, సుగంధ ద్రవ్య, నదీ జలాభిషేకాలు, విభూది, అన్నాభిషేకాలతో బాబా సేవలో భక్తులు తరించారు.

- అక్కయ్యపాలెం లలితానగర్‌లోని శ్రీలలితా పీఠంలో ఉదయం అమ్మవారికి క్షీరాభిషేకం, సన్నిధిలో శ్రీచక్ర నవావరణ, మణిద్వీపంలో అర్చన, శ్రీచక్ర నవావరణ జరిపారు. పీఠం దర్బారు హాల్లో వేద మంత్రాల మధ్య శ్రీగురుదత్తాత్రేయ హోమం నిర్వహించారు. సాయి మందిరంలో బాబాకు విశేష అభిషేకం, హారతులిచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.
- సీతంపేట శ్రీకంఠ గురుదత్త సాయి మందిరంలో క్షీరాభిషేకం, పవిత్ర నదీజలాలు, పంచామృతాలు, ఫలరసాలు, సుగంధ ద్రవ్యోదకాలతో సాయిని అభిషేకించారు. విభూదితో గురుహోమం సహిత లక్ష భస్మా అర్చన చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం జరిపారు. సాయంత్రం మేళతాళాలు, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో సాయినాథుని రథయాత్ర పురవీధుల్లో కనుల పండువగా నిర్వహించారు.
- అక్కయ్యపాలెం జగ్గారావు బ్రిడ్జి వద్ద షిర్డీసాయి ధ్యాన మందిరంలో బాబాకు మంగళస్నానం, క్షీర, జలాభిషేకాలు నిర్వహించారు. పూలమాలలు, ఆభరణాలతో బాబా దివ్యశోభాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.
- అక్కయ్యపాలెం పాలబూత్ సెంటర్‌లో షిర్డీసాయిబాబా సంక్షేమ సేవా సంఘం ఆలయంలో పంచామృతాభిషేకం, నూతన వస్త్ర అలంకరణ, స్వర్ణ కిరీట ధారణతో బాబా భక్తులకు దర్శనమిచ్చారు. సాయినాథుడికి అన్నాభిషేకం జరిపారు.



సీతంపేట శ్రీకంఠ గురుదత్త సాయి మందిరంలో విభూదితో అభిషేకం చేస్తున్న అర్చకులు

ధ్యాన మందిరంలో ప్రత్యేక సేవలు



షిర్డీసాయికి క్షీరాభిషేకం

మర్రిపాలెం: రైల్వే న్యూకాలనీ షిర్డీసాయి బాబా ధ్యాన మందిరంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజా, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సుమారు వెయ్యి లీటర్ల పాలతో భక్తులు సాయినాథుడికి క్షీరాభిషేకం చేశారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి తొమ్మిది వరకు వచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం శ్రీషిర్డీ సాయి సేవా సమితి సభ్యులచే భజన కార్యక్రమం జరిగింది. సంధ్యా హారతి, సాయంత్రం మేళతాళాలతో పల్లకీ సేవ, రాత్రి 9 గంటలకు సేజ్ ఆరతి, భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీతో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా ముగిశాయి.

విశేష అలంకరణలో షిర్డీసాయి

మురళీనగర్: మురళీనగర్ రామాలయంలోని షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరంలో శైవాగమ పండితుడు అయిలూరి శ్రీనివాస దీక్షితులు పర్యవేక్షణలో అర్చకుడు అయిలూరి రామశాస్త్రి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. గోపూజ, గణపతి పూజ అనంతరం లక్ష భస్మాభిషేకం, మహా అన్నాభిషేకం భక్తుల స్వహస్తాలతో నిర్వహించారు. 108 బిందెల పవిత్ర జలాలతో అభిషేకం చేసి భారీ పూలమాలతో బాబాను విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం సాయినాథుడి గ్రామ ప్రదక్షిణ, తిరువీధి ఉత్సవాన్ని నిర్వహించారు. సాయిదత్త మూల మంత్ర హోమాలు, ప్రత్యేక సంధ్యాహారతిని బాబాకు సమర్పించారు. రాత్రి చదుర్వేద గురుపాదుక పూజ, తేజ్ హారతి సమర్పణతో ఉత్సవం ముగిసింది. ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టి.ఎస్.రెడ్డి, ఎస్.వరప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



మురళీనగర్‌లో పుష్పమాలాంకృతుడైన షిర్డీసాయి



లలితా పీఠంలో శ్రీచక్ర నవావరణ అర్చన చేస్తున్న అర్చకులు



సీతంపేటలో అన్నదానంలో పాల్గొన్న భక్తులు

సాయిబాబాకు అన్నాభిషేకం

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు భీంనగర్ సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్పొరేటర్ రెయ్యి వెంకటమణ బాబాను దర్శించుకుని స్వయంగా అన్నాభిషేకం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించారు. కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో స్థానిక భక్తులు పాల్గొన్నారు.



బాబాకు అన్నాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

ఎక్కడ చూసినా చెత్త కుప్పలే..!



మధురానగర్ రోడ్డులో పేరుకుపోయిన వ్యర్థాలు



శ్రీనగర్ రోడ్డులో చెత్త కుప్ప



శ్రీనగర్‌లో విజయదుర్గా అపార్ట్‌మెంట్ ఎదుట పేరుకుపోయిన చెత్త

సీతంపేట: కూటమి ప్రభుత్వం వచ్చాక వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. వీధుల్లో ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఇంటింటా చెత్త సేకరణ సక్రమంగా జరగక పోవడంతో జనం చెత్తను రోడ్డు పక్కన, డ్రెయిన్‌లు, గెడ్డలు, డంపర్ బిన్‌ల వద్ద కవర్లతో పడవేస్తున్నారు. జీవీఎంసీ 25వ వార్డు మధురానగర్‌లో జీవీఎంసీ హైస్కూల్ రోడ్‌లో నిత్యం చెత్త కుప్ప దర్శనమిస్తోంది. 27వ వార్డు శ్రీనగర్ రెడ్డి ఆస్పత్రి రోడ్డులో, విజయదుర్గా అపార్ట్‌మెంట్ ఎదుట, పలు చోట్ల చెత్త కుప్పలు కనిపిస్తున్నాయి. జీవీఎంసీ శానిటరీ అధికారులు స్పందించి పారిశుధ్య నిర్వహణ మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ నార్త్
9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com